క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
కేసు నమోదు చేసిన ట్రాన్స్‌కో అధికారులు



స్తంభాన్ని ఢీ కొనడంతో కారుపై పడిన విద్యుత్ స్తంభం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వచ్చే రోడ్డులో బుధవారం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. పెద్దాపురం నుంచి బ్రౌన్‌పేట వైపు వస్తున్న కారు అదుపు తప్పడంతో బడేలమ్మ చెరువు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కారుపై విద్యుత్ స్తంభం పడడంతో దానిని తొలగించే వరకు కారును తీసే అవకాశం లేక కారుకు తాళం వేసి అందులోని వారు వెళ్లి పోయిన్నట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్‌స్తంభం విరిగి పోవడంతో పెద్దాపురం రోడ్డులోని సుధా ఆయిల్ ఫ్యాక్టరీకి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ట్రాన్సుకో అధికారులు తెలిపారు. కారు యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్లు ట్రాన్సుకో అధికారులు తెలిపారు.

బీసీవై పార్టీ ఎంపీ అభ్యర్థిగా దేవర అనూష



ప్రత్తిపాడు రూరల్: భారత యువజన చైతన్య (బీసీవై) పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థిగా మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన దేవర అనూష యాదవ్ పోటీ చేస్తున్నారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తొలి జాబితాలో ఆమె పేరును ప్రకటించారు. అనూష ఇప్పటికే నియోజకవర్గంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

హార్టికల్చర్ బోర్డు మాజీ డైరెక్టర్ సత్యకృష్ణంరాజు మృతి



తుని రూరల్: నేషనల్ హార్టికల్చర్ బోర్డు మాజీ డైరెక్టర్, జాతీయ కిసాన్ మోర్చా మాజీ కార్యదర్శి బోద్రాజు సత్య కృష్ణంరాజు (47) అనారోగ్యంతో మృతి చెందారు. తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన సత్య కృష్ణంరాజు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కొద్దిరోజులుగా ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విమానంలో ముంబై నుంచి రాజమహేంద్రవరానికి అక్కడ నుంచి అంబులెన్సులో స్వగ్రామం తేటగుంటకు సత్య కృష్ణంరాజు మృతదేహాన్ని తీసుకువచ్చే ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సత్య కృష్ణంరాజుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచి బీజేపీలో చురుగ్గా పని చేశారు. ఆ పార్టీలో వివిధ పదవులు చేపట్టిన ఆయన జాతీయ కిసాన్ మోర్చా కార్యదర్శి, జాతీయ ఉద్యాన బోర్డు డైరెక్టర్‌గా పని చేశారు. సత్యకృష్ణంరాజు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



రామవరం పెట్రోల్ బంక్‌లో సిలిండర్లతో మంటలు ఆర్పే విధానం వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

తుని: ప్రస్తుత వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవ కాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుని అగ్నిమాపక అధికారి కె.రాముడు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థాని క జీఎన్‌టీ రోడ్డులోని పెట్రోల్ బంకులో సిబ్బందికి బు దవారం అవగాహన కల్పించారు. పెట్రోల్ కొట్టే సమయంలో మంటలు వ్యాపిస్తే ఏలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. బంకు యాజమానులు, పని చేసే సిబ్బంది నిబంధనలు పాటించాలని కోరారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

జగ్గంపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని రామవరం పెట్రోల్ బంక్ సిబ్బంది, వినియోగాదారులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్థానిక అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రామలింగేశ్వర కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం ఈ నెల 19 నుంచి 27 వరకూ వైభవంగా జరుగుతాయని ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం విలేకర్లకు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా అమ్మవారు ఈ నెల 19 నుంచి 24 వరకూ బంగారం చీరలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.



వాకతిప్పలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



సామర్లకోట సత్యనారాయణపురం రామాలయం వద్ద కల్యాణాన్ని తిలకించిన దవులూరి దంపతులు

కల్యాణం.. కమనీయం

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలు గ్రామాల్లో అన్నసమారాధనలు

శ్రీరామ నవమి వేడుకలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామాలు, పట్టణాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాలను మామిడి తోరణాలు, పువ్వులతో సుందరంగా అలంకరించారు. పండితులు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.



గోర్సలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పిఠాపురం/కొత్తపల్లి/గొల్లప్రోలు: శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లి మండలం గోర్సలోని పురాతన సీతారామస్వామి ఆలయంలో ఉదయం పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించారు. ఆలయ అర్చకుడు చక్రవర్తుల అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వాకతిప్పలోని పద్మశాలి రామాలయంలో చేనేత కార్మికులు, జాంధానీ వస్త్ర దుకాణ వ్యాపారుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వస్త్ర వ్యాపారుల దంపతులు పీటలపై కూర్చుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పాడ, కొమరగిరి, కుతుకుడుమిల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం, మూలపేట, యండపల్లితో పాటు అన్ని గ్రామాల్లోనూ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాలను విద్యుత్ దీపాలు, రంగులు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ నాయకర్ కాలనీలోని రామలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో పెళ్లి విందును తలపించేలా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉప్పాడ, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సామర్లకోట కల్యాణాల్లో పాల్గొన్న నాయకులు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో సీతారామ కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, చలువ పందిళ్లు వేశారు. ఉదయం ఉత్సవమూర్తులకు స్థానిక గోదావరిలో మంగళ స్నానాలు చేయించి తీసుకువచ్చి మధ్యాహ్నం వేద మంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గం అభ్యర్థి దవులురి దొరబాబు, ఆయన సతీమణి చంద్రకళ, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, భారత మాత సేవాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గొరకపూడి చిన్నయ్యదొర తదితరులు పాల్గొన్ని కల్యాణాన్ని తిలకించి ఆలయాల అర్చకుల ఆశీర్వచనాలు స్వీకరించారు. స్థానిక సత్యనారాయణపురం రామాలయం వద్ద భారీ ఎత్తున రామాలయ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహారాణి సత్రంలో శ్రీరామ నవమి వేడుకలు సత్రం కార్య నిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈఓ దంపతులు కర్తలుగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు జాకెట్ ముక్కలు, గాజులు, విసనకర్రలు, పంచాంగాలను ఉచితంగా అందజేసి భారీ అన్నదానం చేశారు.

గోలి వారి వీధిలో..

స్థానిక గోలివారి వీధి రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పానకం, ప్రసాద వితరణ చేశారు.

రూరల్‌లో..

మండలంలోని ఆయా గ్రామాల్లో రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఆయా రామాలయాల వద్ద కల్యాణాలు నిర్వహించారు.

నిరాడంబరంగా దవులూరి జన్మదిన వేడుకలు



దవులూరి దొరబాబును గజమాలతో సత్కరించిన ఆవాల రాజేశ్వరి దంపతులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు జన్మదిన వేడుకలు బుధవారం నిరాడంబరంగా సాగాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వేడుకలకు దూరంగా ఉండాలని దొరబాబు నిర్ణయించారు. అయితే ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఉదయమే ఆయన ఇంటికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ దొరబాబును గజమాలతో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, అన్నవరం దేవస్థాన ట్రస్టుబోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటుహక్కు వినియోగంపై ప్రచారం



పిఠాపురం ఉప్పాడ సెంటర్లో ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన హోర్డింగ్

పిఠాపురం: ప్రజాస్వామ్య పండగకు సిద్ధం కండి... దృఢమైన ప్రజాస్వామ్యానికి తప్పనిసరిగా ఓటు వేద్దాం ... ప్రజాస్వామ్య గెలిపిద్దాం అంటూ ఓటు హక్కు వినియోగంపై ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేపట్టింది. ఈ మేరకు పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ముఖ్య కూడళ్లలో ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలను చైతన్య పర్చేలా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈసారి ఎన్నికల్లో ఎక్కువ శాతం పోలింగ్ నమోదులా అధికారులు చర్యలు చేపట్టారు.

మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి



ఉప్పాడలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గీత, ఎంపీ అభ్యర్థి సునీల్



చిత్రాడలో పార్టీలో చేరిన వారితో వంగా గీత, చలమలశెట్టి సునీల్

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వంగా గీత, చలమలశెట్టి సునీల్
- ఉప్పాడలో ఆత్మీయ సమావేశం

కొత్తపల్లి: మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయండి.. అని చెప్పే ధైర్యం దేశ రాజకీయాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్ప మరెవ్వరికీ లేదని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ ఇంటి వద్ద బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీటీ పార్టీ నుంచి పది కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరాయి. పార్టీలో చేరిన వారికి వంగి గీత, చలమలశెట్టి సునీల్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధిని గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. హార్బర్ నిర్మాణంతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మేరుగు యల్లాజీ, చొక్కా సింగన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పలువురి చేరిక

పిఠాపురం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన 25 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గుడాల రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు జవ్వాది నాయుడు, సర్పంచ్ కొత్తలూరి సునీత, ఉప సర్పంచ్ కర్రి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మళ్లీ అవకాశం ఇవ్వండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: సంక్షేమం కొనసాగించడానికి గాను వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మళ్లీ అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కోరారు. ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిఠాపురంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటివరకూ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే తమ పార్టీ ఓటు బ్యాంకు అన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే అందజేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. అడుగడుగునా మహిళలు ఆమెకు సాదర స్వాగతం పలికరు. ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటి వరకూ తాను పిఠాపురం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని వివరించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు పెదపాటి రాజేష్, గండేపల్లి బాబీ, పచ్చిమళ్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

స్థానికుడిని.. ఒక అవకాశం ఇవ్వండి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి
- రామాలయంలో పూజలు

సామర్లకోట: వెఎస్సార్ సీపీ నుంచి స్థానిక అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం వచ్చిందని ఒకసారి అవకాశం ఇవ్వండని నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక 25వ వార్డులో కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణ, చిట్టుమాని శ్రీనివాసరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా మతంసెంటర్‌లోని రామాలయంలో పూజలు చేశారు. ప్రజలు స్థానిక అభ్యర్థిని కోరుకుంటున్నారని, దీంతో సీఎం జగన్ తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే సీఎం నవరత్న పథకాలను అమలు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, జి.రాగంపేట సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మాదిగ ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ దుద్దుంపూడి సాయి, అధికార పార్టీ కౌన్సిలర్లు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెద్దాపురంలో దొరబాబుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న చంద్రకళ



సామర్లకోటలో ఇంటింట ప్రచారం చేస్తున్న దవులూరి దొరబాబు

మీకు అండగా ఉండే దవులూరిని గెలిపించండి

పెద్దాపురం: రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా సంక్షేమం కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, నియోజకవర్గ ప్రజలందరికీ అండగా ఉంటామని ఈ సార్వత్రిక ఎన్నికల్లో తన భర్త దొరబాబును గెలిపించాలంటూ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ కోరారు. పట్టణంలో 18వ వార్డులో ఆమె, చిన్న కుమార్తె సాత్విక, అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆ



సామర్లకోటలో పార్టీ ప్రచార వాహనాలను ప్రారంభించిన దొరబాబు

వార్డు కౌన్సిలర్ నీలంశెట్టి అమ్మాజీ, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. మీలో ఒక్కడిగా, స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన తన భర్తకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని చంద్రకళ కోరారు. అలాగే ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళా అభిమానులు పాల్గొన్నారు.

ప్రచార రథాల ప్రారంభం

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల వేడి పెరగడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు బుధవారం తన ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభించారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ప్రతి గ్రామంలోను ప్రచారం చేసేలా మోటారు సైకిళ్లను మినీ ప్రచార వాహనాలుగా తయారు చేయించారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు



సామర్లకోటలోని మాండవ్యనారాయణస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్యాభాగ నదీ తీరాన కొలువైన శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణుని కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఏటా ఉగాది తరువాత వచ్చే ఏకాదశిన స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. గురువారం గరుడవాహన సేవ, శుక్రవారం స్వామి వారికి అమ్మవార్లకు మంగళస్నానాలు, పంచామృతాభిషేకాలు చేస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం విష్వక్సేన పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ, విష్ణు సహస్రనామ పారాయణ, అనంతరం స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 20వ తేది నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని, అదే రోజు రాత్రి స్వామి వారి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. స్వామి వారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.